
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం, 22, జూన్, 2023



సోమశిలలో నీటి నిల్వ
చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారానికి 32.780 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతానికి 92.345 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,720
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,453
3 శాతం జీఎస్టీతో	రూ.5,617
సవర (8గ్రా)	రూ.44,936

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.0 /27.4
జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గాయి. బుధవారం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. గాలిలో 61 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.

న్యూస్‌రీల్

ముగిసిన పసుపు కొనుగోళ్లు



పసుపును గోదాములకు తరలిస్తున్న సిబ్బంది

ఉదయగిరి : ఉదయగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారంతో పసుపు కొనుగోళ్లు ముగిసినట్లు మార్కెట్ ఎగ్జిక్యూటివ్ వేణు పేర్కొన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నుంచి రైతుల వద్ద పసుపు కొనుగోలు ప్రారంభించామన్నారు. ఉదయగిరి, వరికుంటపాడు, సీతారామపురం, దుత్తలూరు మండలాల్లోని 163 మంది రైతుల నుంచి 364.98 మెట్రిక్ టన్నుల పసుపును ఇప్పటివరకు కొనుగోలు చేశామన్నారు. పసుపు విక్రయించిన రైతుల నివేదికను ఉన్నతాధికారులకు పంపామన్నారు. త్వరలో రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తుందన్నారు. క్వింటా మద్దతు ధర రూ.6,850కు కొనుగోలు చేశామని తెలిపారు. కొనుగోలు చేసిన పసుపు నిల్వలను నెల్లూరు, ఆత్మకూరు గోదాములకు తరలించామన్నారు.

గాలీవాన బీభత్సం



తడిచిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

మనుబోలు : నైరుతి రుతుపవనాల ప్రభావంతో మండల పరిధిలో మంగళవారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. పలు గ్రామాల్లో ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మనుబోలు, వెంకన్నపాళెం, బద్దెవోలు, గురివిందపూడి తదితర గ్రామాల్లో ఈదురు గాలులకు పలుచోట్ల పశువుల కొట్టాలు, ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. గురివిందపూడిలో నిల్వ చేసిన 200 పుట్ల ధాన్యం పాక్షికంగా తడిసింది. గురివిందపూడి- ఇడిమేపల్లి మార్గంలో చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి.

నేడు ఎస్జీటీలకు కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్) : డీఎస్సీ 2008 ఎస్జీటీలు 36 మంది, డీఎస్సీ-98 ఎస్జీటీలుగా నియమించిన 239 మందికి గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ గంగాభవాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరంతా కౌన్సెలింగ్‌కు తప్పకుండా హాజరుకావాలన్నారు.

తిరుమలమ్మపాళెం హైలెవల్ బ్రిడ్జికి రూ.13 కోట్లు

వెంకటాచలం: మండలంలోని తీరప్రాంతమైన తిరుమలమ్మపాళెం గ్రామానికి వెళ్లే మార్గంలో ఉప్పు కాలువపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.13 కోట్ల నిధులను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. గతేడాది అక్టోబర్ నెలలో ముత్తుకూరు మండలం నేలటూరులో జరిగిన సభలో తిరుమలమ్మపాళెం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం గురించి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సభా వేదికపైనే హైలెవల్ వంతెన నిర్మిస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీనిని నెరవేరుస్తూ రూ.13 కోట్లు నిధులు విడుదల చేయడంతో త్వరలో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

డిగ్రీ పరీక్షల్లో 34 మంది డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం జరిగిన డిగ్రీ పరీక్షల్లో 34 మంది డిబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన ఐదో సెమిస్టర్ పరీక్షకు 5,511 మందికి గానూ 5,115 మంది విద్యార్థులు హాజరు కాగా 396 మంది గైర్హాజరయ్యారన్నారు. వివిధ పరీక్ష కేంద్రాల్లో ఆరుగురు విద్యార్థులు డిబార్ అయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన రెండో సెమిస్టర్ పరీక్షకు 9,629 మంది విద్యార్థులకు గానూ 8864 మంది హాజరు కాగా 794 మంది గైర్హాజరయ్యారన్నారు. వివిధ పరీక్ష కేంద్రాల్లో 28 మంది విద్యార్థులు డిబార్ అయ్యారని వెల్లడించారు.

హైస్కూల్ ప్లస్ టీచర్లకు కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్) : జిల్లాలోని హైస్కూల్ ప్లస్‌ల్లో వివిధ సబ్జెక్టుల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ గంగాభవాని ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 37 పోస్టులకు 8 మంది హాజరయ్యారు. వీరిలో ఏడుగురు ఉపాధ్యాయులు సుముఖత వ్యక్తం చేయగా, వారి సర్టిఫికెట్లను పరిశీలించి ఆయా పాఠశాలలకు కేటాయించారు.







యోగాభ్యోనమః

అంతర్జాతీయ యోగా దినోత్సవం బుధవారం జిల్లాలో సందడిగా జరిగింది. చిన్నారులు, యువత, పెద్దలు ఉత్సాహంగా యోగాసనాలు వేసి ఆరోగ్యం పట్ల శ్రద్ధను చాటుకున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేలా యోగాసనాలు వేయించారు. ఆరోగ్యకర జీవనానికి యోగా ఎంత అవసరమో వివరించారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో యోగా శిక్షణ కార్యక్రమంలోని దృశ్యాలివి. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

వాడవాడలా ప్రగతి జాడ

సత్ఫలితాలిస్తున్న 'గడప గడపకు మన ప్రభుత్వం'

- ఎమ్మెల్యేల పర్యటనల్లో సమస్యల గుర్తింపు
- త్వరితగతిన పరిష్కార మార్గాలు

'ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లాలి.. ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించాలి.. ప్రతి సచివాలయ పరిధిలో కనీసం ఆరు గంటలైనా పర్యటించాలి.. ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలి.. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా అభివృద్ధి పనులు చేపట్టాలి' అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సూచనలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు చేపట్టిన పర్యటనలు జనం మనసులు గెలుచుకుంటున్నాయి. ఎమ్మెల్యేల దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయి. ఈ క్రమంలోనే వాడవాడల్లో ప్రగతి జాడలు కనిపిస్తోంది. అభివృద్ధి పనులు పరుగులు తీస్తోంది

ఈ ఫొటోలోని ప్రాంతం కోవూరు మండలంలోని పడుగుపాడు గ్రామం మసీదు వీధి. గతంలో ఇక్కడ మట్టిరోడ్డు ఉండడం, డ్రెయినేజీ లేకపోవడంతో వర్షం పడితే నీరు రోడ్డుపై నిలిచేది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో సచివాలయ నిధులను మంజూరు చేయించి సీసీ రోడ్డు, డ్రెయిన్‌ను వేయించారు.



ఇటీవల వేసిన సీసీరోడ్డు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను చేర్చాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో విజయవంతంగా సాగుతోంది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమంలో ప్రతి గడపకు వెళ్లి నాలుగేళ్ల పాలనలో ప్రతి కుటుంబం పొందిన సంక్షేమ లబ్ధిని వివరిస్తున్నారు. పథకాల అమల్లో లోటుపాట్లను ఆరా తీస్తున్నారు. స్థానిక సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఎక్కడికక్కడ జనంతో మమేకమై వారి



అభిమానాన్ని చూరగొంటున్నారు.

సమస్యలు ఆలకించి.. పరిష్కరించి

కార్యక్రమంలో భాగంగా ప్రజలు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను నమోదు చేసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. సమస్య తమ దృష్టికి రాగానే సంబంధిత విభాగ సిబ్బందికి చెబుతున్నారు. వారు సమస్య ప్రాధాన్యతను బట్టి అంచనాలు సిద్ధం చేసి జిల్లా యంత్రాంగానికి పంపుతున్నారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆమోదంతో వెంటనే పరిష్కార చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఇంటి గడపకు వెళ్తూ.. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములు కావడమే కాకుండా సంక్షేమ ఫలాల ప్రగతిని తెలుసుకుంటున్నారు.

శరవేగంగా పనులు..

రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం అధిక ప్రాధాన్యమిస్తోంది. ప్రతి సచివాలయ పరిధిలో ప్రజాప్రతినిధులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేసిన అనంతరం రూ.20 లక్షల వరకు అభివృద్ధి పనులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. వీటి ప్రకారం జిల్లా వ్యాప్తంగా విస్తారంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 534 పనులు పూర్తి కాగా ఇంకా 282 పనులకు సంబంధించిన బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. 202 పనులకు సంబంధించిన బిల్లులు కూడా విడుదల చేశారు.

అంతా పారదర్శకమే..

అభివృద్ధి పనులు ప్రారంభించినప్పటి నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే వరకు మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. పనులు మొదలు పెట్టినప్పుడు ఫొటో తీసి అప్‌లోడ్ చేయడం ద్వారా ఎంపిక పూర్తవుతుంది. పనులు పూర్తయిన తర్వాత ఆయా శాఖల మండల ఇంజినీరింగ్, ఎంపీడీఓ అనుమతితో బిల్లులు అప్‌లోడ్ చేస్తారు. అనంతరం సదరు కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి సీఎఫ్ఎంఎస్ ద్వారా నిధులు జమ చేస్తారు.

జిల్లాలో..

జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది.

జిల్లా పరిధిలో..	
గ్రామ సచివాలయాలు	769
అప్‌లోడ్ చేసిన పనులు	2,176
మంజూరైనవి	2,069
పూర్తయిన పనులు	534
ఖర్చు చేసిన నిధుల	రూ.86.23 కోట్లు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలో 195 రోజుల పాటు 96 వేల గడపలను సందర్శించి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అలాగే కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి 66 సచివాలయాల పరిధిలో 155 రోజుల పాటు పర్యటించి 80 వేల గడపలను సందర్శించారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నియోజకవర్గంలో 63 సచివాలయ పరిధిలో 122 రోజుల పాటు పర్యటించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి 129 రోజుల పాటు పర్యటించి 49 వేల గడపలు సందర్శించారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ 62 సచివాలయ పరిధిలోని 123 రోజుల పాటు పర్యటించారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి నియోజవకర్గ పరిధిలోని ప్రతి గడపను సందర్శిస్తున్నారు.

ఇచ్చిన మాట నెరవేర్చారు



ఇటీవల 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మా ప్రాంతానికి వచ్చారు. అప్పుడు మా రోడ్డు పరిస్థితిని వివరించాం. వెంటనే పంచాయతీరాజ్ అధికారులను పిలిచి అంచనా వేయించి పది రోజుల్లో రోడ్డు వేయాలని ఆదేశించారు. చెప్పిన మాట ప్రకారం గడువులోపు మా ప్రాంతంలో సీసీరోడ్డును పూర్తి చేశారు.

– గొల్లప్రోలు ఆదిశేషయ్య, ఏఎంసీ డైరెక్టర్, పడుగుపాడు, కోవూరు

సమస్యలు తీరాయి



గతంలో చిన్నపాటి వర్షానికే మా రోడ్డు జలమయం అయ్యేది. బయటకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పేవి. గడప గడపకు మన ప్రభుత్వంలో మా సమస్యను వివరించాం. వెంటనే నిధులు మంజూరు చేయించి మా ప్రాంతంలో రోడ్డు వేయించారు. దీంతో మా సమస్యలు తొలగిపోయాయి. ఈ ప్రభుతంలో అంతా మంచే జరుగుతోంది.

– బత్తల శ్రీనివాసులు, పడుగుపాడు, కోవూరు

డ్రెయినేజీ నిర్మించారు



వర్షాలకు మా ఇంటి చుట్టూ నీరు చేరేది. దీనివల్ల దోమలు చేరి అనారోగ్యానికి గురయ్యే వాళ్లం. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి దృష్టికి మా సమస్యను తీసుకెళ్లాం. ఆయన స్పందించి డ్రెయినేజీ నిర్మించేలా చూశారు. ప్రస్తుతం మా సమస్య తీరింది. – చక్రాల సుజాత, నబ్బినగరం, ఆత్మకూరు మండలం

సర్వేపల్లిలో బయో ఎనర్జీ ప్లాంట్లు

- నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న సీఎం వైఎస్ జగన్
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ హరినారాయణన్
- నిర్మాణాలు పూర్తయితే వెయ్యి మందికిపైగా ఉపాధి

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లిలో రెండు బయో ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. సర్వేపల్లిలోని సర్వే నంబర్ 2508లో 298 ఎకరాల భూమిని 2015లో క్రిబ్‌కో ఎరువుల కర్మాగారం ఏర్పాటుకు కేటాయించారు. వివిధ కారణాల వల్ల ఎరువుల కర్మాగారం ఏర్పాటుకు అడ్డంకులు కలిగాయి. అయితే ఎట్టకేలకు క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన భూముల్లో ఎరువుల కర్మాగారం బదులుగా రెండు బయో ఎనర్జీ



ఏర్పాట్ల గురించి చర్చిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

ప్లాంట్ల ఏర్పాటుకు గురువారం శంకుస్థాపన జరుగనుంది.

వందెకరాల్లో రెండు ప్లాంట్లు

క్రిబ్‌కోకు కేటాయించిన 298 ఎకరాల్లో క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ ఆధ్వర్యంలో 50 ఎకరాల్లో బయో ఇథనాల్ ప్లాంట్, అలాగే విశ్వ సముద్ర ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 50 ఎకరాల్లో మరో బయో ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ రెండు ప్లాంట్లు ఏడాదిలోపు పూర్తి కానున్నట్లు కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. నిర్మాణాలు పూర్తయితే వెయ్యి మందికి పైగా ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

బయో ఎనర్జీ ప్లాంట్లకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో సర్వేపల్లిలో క్రిబ్‌కోకు కేటాయించిన భూముల్లో ఏర్పాట్లను కలెక్టర్ ఎం.హరినారాయణన్ బుధవారం పరిశీలించారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని ఈ ప్రాంతం నుంచి వీక్షించేందుకు విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ కనక్షన్లు, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లపై ఆరాతీశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఇతర ప్రముఖులు హాజరు కానుండడంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయించాలని కంపెనీ ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు.



క్రిబ్‌కోకు కేటాయించిన భూముల్లో ఏర్పాటు చేసిన బోర్డు

రాడార్ పనుల్లో పురోగతి

- ఐదేళ్ల తర్వాత వేగం
- చెన్నై వింగ్ కమాండర్ పర్యవేక్షణలో పనులు
- ఈ కేంద్రానికి 63 ఎకరాల స్థలం అప్పగింత

పొదలకూరు: విమాన సర్వీసులను నిర్దేశించే రాడార్ కేంద్రం పొదలకూరుకు సమీపంలో ఏర్పాటు కానుంది. దీనికోసం ఐదేళ్ల క్రితం భూములను కేటాయించగా, ఎట్టకేలకు పనుల్లో వేగం పెరిగింది. ఇక్కడ రాడార్ కేంద్రం ఏర్పడితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ప్రచారం జరగడంతో యువత ఆశలు పెంచుకుంది. అయితే వారి ఆశలు ఆవిరయ్యేలా విమానయాన శాఖ చాలాకాలం పనులు చేపట్టలేదు. ఐదేళ్ల క్రితం వింగ్ కమాండర్ మండలంలోని నెల్లూరు మార్గంలో మరుపూరు గ్రామ సమీపాన 63.6 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎయిర్‌ఫోర్స్ కోసం రెవెన్యూ అధికారుల వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఇందు కోసం జిల్లా కలెక్టర్ స్థాయిలో పెద్ద కసరత్తే జరిగింది. రాడార్ కేంద్రానికి రక్షణగా వైమానిక దళం కోసం 100 క్వార్టర్స్‌ను నిర్మించేందుకు అంచనాలు వేశారు. విమాన సర్వీసుల దశ, దిశలను తెలుసుకునేందుకు మరుపూరు వద్ద సిగ్నల్స్ బాగా అందుతుండడంతో భారత వైమానిక దళ ఉన్నతస్థాయి అధికారులు ఇక్కడి భూములను ఎంపిక చేసుకున్నారు. అంతేకాక 2010లోనే రాడార్ కేంద్రం ఏర్పాటుపై ప్రకటన వెలువడింది.

వివాదాలతో కాలయాపన

రాడార్ కేంద్రం కోసం రెవెన్యూ అధికారులు 63 ఎకరాలను ఎయిర్‌ఫోర్స్‌కు అప్పగించారు. రెండున్నరేళ్ల క్రితం అటవీశాఖ ఉన్నత స్థాయి అధికారులు జిల్లాలో ఆ శాఖ భూములను గుర్తించే పనిలో మరుపూరు వద్ద రాడార్‌కు కేటాయించిన భూములు అటవీశాఖవిగా పేర్కొంటూ రెవెన్యూ




రాడార్ కేంద్రం కోసం నిర్మించిన భవనం

అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో రాడార్ భూములకు అడ్డంకులు ఏర్పడ్డాయి. తమ భూములకు హద్దులను ఏర్పాటు చేసుకుని చుట్టూ ప్రహరీ నిర్మించుకునే క్రమంలో భూములు ఏ శాఖకు చెందినవో తెలియక కాలయాపన జరిగింది. దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకుని ఎయిర్‌ఫోర్స్‌కు కేటాయించిన భూములు ప్రభుత్వానికి చెందినవిగా తేల్చడంతో రెవెన్యూ, అటవీశాఖల మధ్య వివాదం సర్దుమణిగింది.

రూ.9 కోట్లతో పనులు

ప్రస్తుతం రాడార్ కేంద్ర నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. రూ.9 కోట్లతో పనులను నిర్వహిస్తున్నారు. గుంటూరుకు చెందిన కాంట్రాక్టర్ ఆన్‌లైన్ టెండర్లలో రాడార్ కేంద్రం పనులను దక్కించుకున్నారు. వీటిని విశాఖపట్నం ఎయిర్‌లైన్స్ పర్యవేక్షిస్తోంది. అయితే చెన్నై వింగ్ కమాండర్ తరచూ వచ్చి పనులను పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం రాడార్‌కు కేటాయించిన భూములకు కాంపౌండ్ వాల్, మూడు భవనాలను నిర్మిస్తున్నట్లు అక్కడి సూపర్‌వైజర్ వెల్లడించారు. తర్వాత దశల వారీగా నిధుల కేటాయింపు జరుగుతుంది. ప్రస్తుతం రాడార్ భూముల చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. లోపల భవనాలకు సంబంధించిన నిర్మాణ పనుల వేగం పెరిగింది. గత ప్రభుత్వ పాలకులు చొరవ చూపి ఉంటే రాడార్ కేంద్రం నిర్మాణం పనులు కొంతవరకు జరిగి ఉండేవని ఈ ప్రాంత యువకులు వెల్లడిస్తున్నారు.



కేంద్రంలో సెక్యూరిటీ భవనం

ప్రత్యేక గుర్తింపు వస్తుంది



రాడార్ కేంద్రం ప్రారంభమైతే మరుపూరుకు సమీపంలో పెద్ద టౌన్‌షిప్ ఏర్పడుతుంది. దీనివల్ల ఇక్కడి భూముల విలువలు అమాంతం పెరుగుతుంది. అంతేకాకుండా పొదలకూరు ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు వస్తుంది.

– ఎస్‌కే అంజాద్, పొదలకూరు

ఐదేళ్ల క్రితమే భూముల అప్పగింత

రాడార్ కేంద్రం నిర్మాణానికి ఐదేళ్ల క్రితమే ఎయిర్‌లైన్స్‌కు 63 ఎకరాల భూములను అప్పగించారు. తర్వాత చాలాకాలం అక్కడ పనులు జరగలేదు. ఇప్పుడు పనులు వేగంగా జరుగుతున్నాయి. రెవెన్యూశాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు లేవు.

– గణేష్‌సాయి, డిప్యూటీ తహసీల్దార్, పొదలకూరు

జాతీయ రహదారి నిర్మాణం.. దీని వల్ల ప్రజలకు ఎన్నో ఉపయోగాలున్నాయి. భారీ వాహనాల ద్వారా సరుకుల రవాణా సులభతరమవుతుంది. ప్రయాణికుల రాకపోకలు ఇబ్బంది లేకుండా హాయిగా జరుగుతాయి. 167–బీజీ హైవే.. ఈ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. ఇది పూర్తయితే పై ప్రయోజనాలతోపాటు మెట్ట గ్రామాల రూపురేఖలు మారుతాయి.


దుత్తలూరు - వింజమూరు మధ్య పూర్తయిన జాతీయ రహదారి పనులు

హైవేగంగా పనులు

- చురుగ్గా సాగుతున్న దుత్తలూరు – కావలి రోడ్డు నిర్మాణం
- మరో పదినెలల్లో 79 కి.మీ పూర్తికి చర్యలు
- త్వరలో దుత్తలూరు – సీతారామపురం హైవే పనుల ప్రారంభం
- 36.4 కిలోమీటర్లకు టెండర్ల ఖరారు

ఉదయగిరి: జిల్లాలో 167–బీజీ జాతీయ రహదారి నిర్మాణం వేగంగా జరుగుతోంది. తొలుత కావలి - దుత్తలూరు రోడ్డు పనులు చేపట్టారు. దీనికి సంబంధించి ఇప్పటికే 25 శాతం మేర పనులు పూర్తయ్యాయి. వింజమూరు నుంచి జలదంకి వరకు రోడ్డు నిర్మాణం వేగం పుంజుకుంది. దీంతో చాలావరకు రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. కోస్తా ప్రాంతం నుంచి రాయలసీమ జిల్లాలకు రవాణా పరంగా ఈ రహదారి ఎంతో ఉపయోగకరం. పూర్తిగా మెట్ట పల్లెలను కలుపుతూ వెళ్లే ఈ రహదారి పనులను 2024 ఏప్రిల్ నాటికి పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకున్నారు. దీంతో ఉదయగిరి, కావలి నియోజకవర్గాల్లోని మెట్ట గ్రామాల రూపురేఖలు మారనున్నాయి.

మొదటి దశలో..

జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా జిల్లాలోని కావలి నుంచి సీతారామపురం వరకు 107 కిలోమీటర్ల రహదారిని నేషనల్ హైవేగా విస్తరించేందుకు ప్రభుత్వం రూ.757 కోట్లు మంజూరు చేసింది. మొదటి దశలో కావలి నుంచి దుత్తలూరు వరకు 79 కి.మీ రహదారి పనుల పూర్తి చేసేందుకు రూ.490 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. దాదాపు 25 కి.మీ మేర తారు రోడ్డు వేశారు. కల్వర్టులు, వంతెన పనుల చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే కావలి నుంచి బద్వేలు, కడప, అనంతపురం, పులివెందుల, పుట్టపర్తి వైపు వెళ్లే వాహనాలు దుత్తలూరు వద్ద 167 జాతీయ రహదారికి అనుసంధానమవుతాయి. రామాయపట్నం పోర్టు ప్రారంభమయ్యాక నిత్యం వందలాది భారీ వాహనాల ద్వారా ఇతర రాష్ట్రాల్లో ఉన్న పరిశ్రమలకు ముడి సరుకులు సులువుగా సరఫరా చేసే వీలుంది. మెట్ట ప్రాంతాల్లో పండించే వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతికి రవాణా సదుపాయాలు మెరుగవుతాయి. దీంతో ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతుతాయి.

పనులు వేగంగా జరుగుతున్నాయి

దుత్తలూరు - కావలి జాతీయ రహదారి పనులు ఇంత వరకు 25 శాతం పూర్తి చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తారు. దుత్తలూరు - సీతారామపురం రహదారికి కూడా రూ.267 కోట్లు నిధులు వచ్చాయి. టెండర్ల ప్రక్రియ ముగిసింది. మరో రెండు నెలల్లో పనులు మొదలవుతాయి. 18 నెలల్లో పూర్తి చేస్తారు.
– అనిల్‌కుమార్‌రెడ్డి, డీఈ, నేషనల్ హైవే


బ్రహ్మేశ్వరం వద్ద జరుగుతున్న వంతెన నిర్మాణం

మొదటి దశ :
దుత్తలూరు నుంచి కావలి వరకు..
ఎన్ని కిలోమీటర్లు : 79
నిధులు : రూ.490 కోట్లు

రెండో దశ :
దుత్తలూరు – సీతారామపురం
ఎన్ని కిలోమీటర్లు : 36.4
నిధులు : రూ.267 కోట్లు

ఈ రోడ్డుకు రూ.267 కోట్లు

రెండో దశలో కావలి నుంచి సీతారామపురం వరకు జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ఇటీవల కేంద్రం మరో రూ.267 కోట్లు కేటాయించింది. టెండర్లు ఖరారయ్యాయి. పనులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 36.4 కి.మీ మేర రహదారి నిర్మాణం చేస్తారు. ఉదయగిరిలో సబ్‌స్టేషన్ వద్ద నుంచి ఊరు బయట కొత్తగా బైపాస్ నిర్మాణం చేపడతారు. ఇది 1.7 కిలోమీటర్ల మేర ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

వైఎస్సార్ ఆలోచన

బాగా వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన వైఎస్ రాజశేఖరరెడ్డికి ఎప్పటి నుంచో ఉండేది. ఆయన సీఎం అయ్యాక ఈ మార్గాన్ని జాతీయ రహదారిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. అయితే కొన్ని కారణాలతో జాప్యం జరిగింది. ఆయన మరణం తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఈ హైవేను మంజూరు చేయించారు. పనులు కూడా శరవేగంగా జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 170
లేయర్ (లైవ్) : 108
బ్రాయిలర్ చికెన్ : 286
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 316
లేయర్ చికెన్ : 184

నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.34
సన్నవి : రూ.20
పండ్లు : రూ.7

ప్రకటన

[illegible]
ఒంగోలు
తేది: 21.06.2023



జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నెల్లూరు(సెంట్రల్): ఆర్థిక అక్షరాస్యతపై పాఠశాల విద్యార్థులకు రిజర్వ్ బ్యాంకు నిర్వహించిన అఖిల భారత క్విజ్ పోటీల్లో జిల్లా స్థాయికి 74 మంది ఎంపికయ్యారని లీడ్ డిస్ట్రిక్ బ్యాంకు మేనేజర్ టి.శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నెల్లూరులోని సుంకు చెంగన్న పాఠశాలలో బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల నుంచి 337 పాఠశాలల విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈనెల 28వ తేదీన జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. అందులో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి పంపడం జరుగుతుందన్నారు.


ప్రతిభ చూపిన విద్యార్థులతో అధికారులు

53 మంది సర్టిఫికెట్ల పరిశీలన

నెల్లూరు(టౌన్): జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పోస్టుల భర్తీకి బుధవారం నెల్లూరు సమగ్రశిక్ష కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించారు. మొత్తం 42 పోస్టులకు 113 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 53 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరి సర్టిఫికెట్లను సమగ్రశిక్ష అధికారులు పరిశీలించారు. మిగిలిన వారు గురువారం తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో సమగ్రశిక్ష కార్యాలయానికి రావాలని ఏపీసీ ఉషారాణి తెలిపారు.


అభ్యర్థులతో మాట్లాడుతున్న అధికారులు

మోటార్‌బైక్‌ల దొంగ అరెస్ట్

- 11 వాహనాల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): మోటార్‌బైక్ దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న పాతనేరస్తుడిని వేదాయపాళెం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. బీవీ నగర్‌కు చెందిన సూర్య మద్యానికి బానిసై దొంగగా మారాడు. బైక్ దొంగతనాలకు పాల్పడుతూ జల్సాలు చేయసాగాడు. ఇటీవల వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మోటార్‌బైక్‌ల చోరీలు ఎక్కువ కావడంతో నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచారు. సూర్య బైక్ చోరీలకు పాల్పడుతున్నారని పక్కా సమాచారం అందుకున్న పోలీసులు అతడి కదలికలపై నిఘా ఉంచారు. బుధవారం అదుపులోకి తీసుకుని విచారించగా వేదాయపాళెం, సంతపేట, బాలాజీనగర్, టీపీ గూడూరు, తిరుపతి జిల్లాలోని పలు పోలీసుస్టేషన్ల పరిధిలో 11 వాహనాలను చోరీ చేసినట్లు నేరం అంగీకరించారు. దీంతో అతడిని అరెస్ట్ చేసి రూ.5.40 లక్షల విలువ చేసే 11 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఎస్సై రాజకుమార్, సిబ్బంది ప్రసాద్, సుబ్బారావు, గోపాల్, నాగరాజు, మాలకొండయ్యను డీఎస్పీ అభినందించారు.

యువకుడి మృతదేహం లభ్యం


దావూద్ మృతదేహం

కోవూరు: పెన్నా నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం బుధవారం ఉదయం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రంగనాయకులపేటకు చెందిన ఐదుగురు స్నేహితులు మంగళవారం పోతిరెడ్డిపాళెం వద్ద పెన్నా నదిలో ఈతకెళ్లారు. వారిలో దావూద్ (20) అనే యువకుడు గల్లంతైన విషయం తెలిసిందే. బుధవారం కోవూరు ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు గజ ఈతగాళ్లను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో దావూద్ మృతదేహాన్ని వెలికి తీయగా కోవూరు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేసిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

